క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేఎల్‌యూ రోడ్‌లోని లైన్ల మార్పిడి నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తాడేపల్లి రూరల్ ప్రాంతంలోని మెల్లెంపూడి గ్రామంలో అగ్రికల్చర్ సర్వీస్‌లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు




ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని విఘ్నేశ్వరుడికి ఆశ్వయుజ బహుళ చవితిని పురస్కరించుకొని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు ఉమాపతిశాస్త్రి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, గరికతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. అనంతరం ఉండ్రాళ్లు నివేదన కావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పైప్‌లైన్ క్లీనింగ్ పనులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని 15వ వార్డులో బుధవారం కార్పొరేషన్ సిబ్బంది తాగునీటి పైపులైన్ల క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. 15 రోజులకు ఒకసారి పంప్‌హౌస్ నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లలోనికి బ్లీచింగ్ పంపించి పైపులైన్ల క్లీనింగ్ చేపడుతున్నామని దానిలో భాగంగా బుధవారం 15వ వార్డులో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ముందస్తుగా కార్పొరేషన్ నీటిని వినియోగించుకునేవారికి నీటిని వినియోగించవద్దని సమాచారం అందించామని, క్లీనింగ్ అయిన పైపుల ద్వారా వచ్చిన వేస్ట్‌ను అవుట్‌లెట్ ద్వారా బయటకు పంపినట్లు వారు తెలియజేశారు.

సీఐ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సీఐగా మల్లిఖార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మల్లిఖార్జునరావు గతంలో చీరాల వన్‌టౌన్‌లో విధులు నిర్వహిస్తూ, బదిలీపై విచ్చేశారు. ఆయన రాకను పురస్కరించుకుని సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇప్పటివరకు సీఐగా బాధ్యతలు నిర్వహించిన శేషగిరిరావు చీరాలలో బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లారు.

అనుబంధ ఆహారంతోనే ఆరోగ్యం

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన



నిడుముక్కల(తాడికొండ): గర్భిణులు, బాలింతలు తగిన అనుబంధ ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు సూచించారు. గ్రామీణ అవగాహన, అనుభవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన అనంతరం వారు గర్భిణులు, బాలింతలతో పాటు 6 - 23 నెలల చిన్నారులకు అందించాల్సిన అనుబంధ ఆహారం అందించే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విశ్వనాథ్, వంశీ, మహేష్, అభిలాష్, ప్రేమ్ కుమార్ అంగన్‌వాడీ కార్యకర్త ఏసు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం.. అజరామరం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం
- వాడవాడలా అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: తెలుగువారికి ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే తపనతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, తన ప్రాణాలు పోతున్నా ఆశయసాధన వైపే మొగ్గిన అమరజీవి పొట్టి శ్రీరాములును తెలుగు జాతి మర్చిపోదని, మర్చిపోకూడదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని మెయిన్ బజారులో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే ఆర్కే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారి చూపిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఇందు కోసం ఆయన చివరకు తన ప్రాణాన్ని సైతం అర్పించారని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములును మనమంతా స్మరించుకోవడంతో పాటు ఆ మహనీయుడు చూపిన బాటలో నడుచుకోవాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సంకా బాలాజీ గుప్తా, దేవతి భగవన్నారాయణ, మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపరాణి, పార్టీ నాయకులు కలకోటి బోయేజు, బేతపూడి నర్సయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని కొనియాడారు.ఆ మహనీయుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆయన అన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎండీ గోరేబాబు, సింకా గంగాధర రావు, గోగుల శ్రీను, వైఎస్సా ర్‌సీపీ నాయకులు కళ్యాణ్, పి. సుబ్బారావు, శ్రీనివాస్ రాజు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

దుగ్గిరాలలో...

దుగ్గిరాల గ్రామంలోని రైలుపేటలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని భారతీయ జనతాపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దానబోయిన శివాజీ, మార్కెట్ యార్డు కార్మికులు పాల్గొన్నారు.



తాడికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తాడికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో..

తాడికొండ: ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీ రాములు త్యాగం మరువలేనిదని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నంబూరు పాపారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తాడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు నంబూరు వెంకటేశ్వరరావు, బొబ్బిలి బ్రహ్మయ్యల ఆధ్వర్యంలో ఎఫ్ఏ -2 పరీక్షలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు 7–10 తరగతులు విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నంబూరు పాపారావును ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అంకెం సాంబశివరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

మంగళగిరి: నగరంలోని టిడ్కో గృహసముదాయంలో తుదిదశకు చేరుకున్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఈనెల 10వ తేదీన ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. బుధవారం ఆయన టిడ్కో గృహసముదాయంలో తుదిదశకు చేరుకున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సుమారు రూ.8 కోట్ల వ్యయంతో అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పూర్తిస్థాయి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించడం జరుగుతుందని, టిడ్కో గృహ సముదాయ వాసులకు ఇక విద్యుత్‌లో ఓల్టేజీ సమస్య తీరనుందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంత వాసులకు ఏపీఐఐసీ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండగా రానున్న వేసవికాలంలో అటు ఏపీఐఐసీతో పాటు టిడ్కో గృహాలకు కూడా విద్యుత్ డిమాండ్ అధికం కానున్న నేపథ్యంలో ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఈనెల 10వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంలోని టిడ్కో గృహాలతో పాటు మార్కండేయ కాలనీ, రాజీవ్ గృహకల్ప, మన్నెం వారి బజారుకు ఈ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు..

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప, టిడ్కో గృహ సముదాయం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ఆర్కే సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన పలువురితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.



నిడమర్రులో బీటీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కార్పొరేషన్ పరిధి నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రహదారి నిర్మాణ పనులను ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నిడమర్రులో సుమారు రెండు కిలోమీటర్ల మేర పొడవుతో రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టడం జరిగిందన్నారు.

రోడ్డు నిర్మాణం వల్ల టిడ్కో వాసులతో పాటు 500 ఎకరాల వ్యవసాయ రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎవరూ ఊహించని విధంగా ఎమ్మెల్యే ఆర్కే చొరవతో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో స్థానిక ప్రజలు, రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలి

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు
- రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

రావెల(తాడికొండ): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు అన్నారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా తాడికొండ మండలం రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సే నో టు కరప్షన్ కమిట్ టు ది నేషన్ అనే అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించిన అనంతరం చిన్నారులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీవీ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీఎస్ నాగేశ్వరరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్

ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీలలో చెత్తసేకరణలో భాగంగా డస్టుబిన్‌లు పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గ్రామాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘననివాళి..

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఆమరణదీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు మహాపురుషుడని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, ఏఓ రవిబాబు, పంచాయతీ కార్యదర్శులు కె.విష్ణువర్ధన్‌రావు, జీవీఆర్‌కే మూర్తి, ఏకే బాబు, సత్యానంద్, వెంకట్రావు, లక్ష్మీశారద, గజేంద్రలు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు డస్టుబిన్‌లు అందజేస్తున్న ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్

క్రీడలతో మానసిక ఉల్లాసం



తెనాలిఅర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో క్రీడల ప్రాధాన్యత తగ్గటం బాధకరమన్నారు. అందరు క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో పోటీలను ప్రారంభించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జి ఎం.హృదయరాజ్, ప్రిన్సిపాల్ రాము, ఛాంప్ హెచ్‌ఎం జిగర్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు, వ్యాయమ ఉపాధ్యాయులు డి.రాజేష్, ఐ.నరేష్ పాల్గొన్నారు.

నేడు చెంచుపేటలో మెడికల్ క్యాంప్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గురువారం చెంచుపేటలోని రత్నశ్రీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33వ సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు. అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

వ్యర్థాల నిర్వహణ ఆధునిక పద్ధతుల పరిశీలన

యూనిడో ప్రతినిధులతో కలిసి విదేశాల్లో పర్యటిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ది ఇంటర్నేషనల్ వియన్నా ఎనర్జీ అండ్ క్లైమేట్ ఫోరం కాన్ఫరెన్స్‌లో భాగంగా స్వీడన్‌లోని స్వీడిష్ ఎన్విరాన్మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లను యునిడో ప్రతినిధులతో కలసి నగర కమిషనర్ కీర్తి చేకూరి పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, క్లీన్ సిటీల నిర్వహణలో భాగంగా అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు స్వీడన్, ఆస్ట్రియాల్లో పర్యటిస్తున్న కమిషనర్ స్వీడన్‌లోని స్టాక్ హోంలో స్వీడిష్ ఎన్విరాన్మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్, వాటర్ ఇన్నోవేషన్ సెంటర్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఎనర్జీ ప్లాంట్లలో వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న ఆధునిక విధానాలు, వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే నివాసాలు, సంస్థల నుంచి ప్లాంట్‌లకు వ్యర్థాలు తరలించడం, కార్మికులతో కాకుండా యంత్రాలతో వ్యర్థాలను తడి, పొడి, ప్లాస్టిక్, ఇతర వస్తువులుగా వేరు చేయడం, వాటిని తిరిగి ఉపయోగపడే వస్తువులుగా మార్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం నేరుగా ఇళ్ల దగ్గర నుంచి వ్యర్థాల సేకరణ చేసే విధానాన్ని తెలుసుకున్నారు. లింకోపింగ్ యూనివర్సిటీ బృందంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కి సంబంధించి వివిధ అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.



బృంద సభ్యులతో కలసి ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు బుధవారం కోరారు. దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్ నిధులు, రాజధాని నిర్మాణానికి నిధులు, కేంద్ర విద్యాసంస్థలు, కడప స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్ లాంటివి ఇవ్వకుండా అన్యాయం చేసిందని అన్నారు. ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర రాయలసీమ నుంచి బయలుదేరి నవంబర్ 9న మంగళగిరి వస్తున్న సందర్భంగా ఆ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, అద్దంకి పాములు, కొండలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు

కేఎల్‌యులో ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ, తెలంగాణ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను జోనల్ స్థాయిలో ఎంపిక చేసి వెస్ట్‌జోన్ తరఫున 40 మందిని వచ్చే ఏడాది ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు పంపుతామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు ఇక్కడ నిర్వహిస్తున్న ఎంపికల్లో పాల్గొనేందుకు ఆరు రాష్ట్రాల నుంచి 200 మంది బాలికలు హాజరయ్యారని పేర్కొన్నారు. కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతమీదే ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో యువజనశాఖ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి సైదా నాయక్, సిబ్బంది ఎస్.సంజయ్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ, తెలంగాణ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ

గురుభక్తి, త్యాగనిరతికి నిదర్శనం ఏకలవ్యుడు

నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఏకలవ్యుడు విగ్రహం ఆవిష్కరణ

నెహ్రూనగర్: గురుభక్తి, త్యాగనిరతికి ఏకలవ్యుడు నిలువెత్తు నిదర్శనమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రోణాచార్యుని మీద గురుభక్తితో ఆయన విగ్రహాన్నే గురువుగా భావించి అత్యుత్తమ విలుకానిగా ఏకలవ్యుడు ఖ్యాతిని పొందాడని తెలిపారు. గురువు కోరిన వెంటనే ఏ మాత్రం సంకోచం లేకుండా విలువిద్యకు కీలకమైన తన బొటన వేలునే గురువుకి కానుకగా అందించిన త్యాగధనుడని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, విగ్రహ కమిటీ సభ్యులు కె. వెంకటేశ్వర్లు, కొండారెడ్డి శ్రీనివాసరావు, కుందనాటి సంజయ్ బాబు, మేడ శ్రీనివాసరావు, తోకల రామకృష్ణ, దేవరవాయి రామారావు, అన్నంపల్లి వెంకట పద్మారావు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మేయర్ కావటి, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్

గంగలో విషనాగులు పుస్తకావిష్కరణ

తెనాలి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, తెనాలి ప్రచార విభాగం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని పెన్షనర్ హాలులో ఏర్పాటైన ప్రత్యేక సభలో ×గంగలో విషనాగులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాజీవ్ మల్హోత్రా ఆంగ్లంలో రాయగా, డాక్టర్ బి.సారంగపాణి తెలుగులో అనువదించి ప్రచురించిన ఈ పుస్తకాన్ని ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ చైర్మన్ చందు రామారావు ఆవిష్కరించారు. రచయిత డాక్టర్ బి.సారంగపాణి ముఖ్యవక్త కాగా, చేబ్రోలులోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజి డీన్ అవ్వారు లత, భారత్ వికాస్ పరిషత్ యేపూరి హరిపూర్ణప్రసాద్ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ త్రిపురమల్లు హనుమత్ ప్రసాద్, కపుతరపు రామచంద్రరావు, నాగలింగం శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

15న విజయవాడలో ప్రజా రక్షణభేరి

తెనాలిటౌన్: ప్రత్యామ్నాయ ఆలోచనలను ప్రజలలో పెంపొందించేందుకే సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోఈ నెల 15న విజయవాడలో ప్రజా రక్షణభే రీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొల్లిపర బాబూ ప్రసాద్ తెలిపారు. చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ప్రజా రక్షణభేరీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పాల్గొంటారని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, పి.జోసేఫ్, వెంకటసుబ్బయ్య, ఎం.సాంబశివరావు, ఏసోబు, రాంబాబు, పవన్‌తేజ, శంకర్, వర్దన్, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలుపుదల చేసి, కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విద్యార్థి, యువజన సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా లక్ష్మణరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని ప్రారంభించిన ఉద్యమం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్‌కు పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు మాట్లాడారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని, జిల్లా కార్యదర్శి వలి, కాంగ్రెస్ నాయకుడు కట్టా జవహర్‌బాబు, విద్యార్థి నాయకులు శశి, షేక్ కరీం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసింహ, ఎస్కే సమీర్, నాయకులు భగత్ సింగ్, యస్వంత్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుచరిత, మౌనిక, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నర్సింగ్ విద్యార్థి సంఘ నాయకులు స్వచ్ఛంద ప్రసాద్ పాల్గొన్నారు.